బ్రతికినవాళ్ళకి జరపవలసిన విద్యుక్త ధర్మాలు జరిపి, శ్రీనివాసరావు మళ్ళీ యింటికి మళ్ళబోయేటప్పటికి చీకటిపడింది. ఆ చీకటిలోనే ఒళ్లు తెలియని వేగంతో గుర్రాన్ని పరుగెత్తించి యింటికి చేరుకున్నాడు. గుర్రం దిగి యింట్లో అడుగుపెట్టాడో లేదో "అమ్మాయిగారు పోయినా రయ్యా!" అన్నాడు యానాదివాడు.

"అయిపోయిందీ?" అని అక్కడే కూలబడ్డాడు శ్రీనివాసరావు.

సబిన్‌స్పెక్టరు వచ్చిన సంగతి తెలిసి, రైటరు, స్టేషనుకు వచ్చిన టపా తీసుకొని యింటికి వచ్చి, "తమ సెలవు గ్రాంటు అయిం దయ్యా! పెద్ద దొరగారు గ్రాంటుచేసి నాలుగు రోజు లయింది. కాగితం సర్కిలిన్‌స్పెక్టరు దగ్గర్నుంచి రావడం ఆలస్యం అయింది" అంటూ సెలవు ఆర్డరును సబిన్‌స్పెక్టరు చేతికి యిచ్చాడు.

---

Laxminarayana Book Stall
ALL KINDS OF PAPERS &
MAGAZINES SUPPLIERS
RASTI HYDERABAD

# 17. ఎవరు దోషి?

"ఎలాగయినా సాక్ష్యం సంపాయించాలి. జిల్లా సూపర్నెంటు మకాంలో ఉండగా ఇలాంటి ఘోరం జరిగిందంటే, దానికి తగిన కూపీ తియ్యకపోతే, మన ఉద్యోగాలు దక్కవు" అంటూ చేతులో ఉన్న సగం కాలిన చుట్టకొనను మునిపంటితో కొరుకుతూ, ఎదుట కూర్చున్న హెడ్‌కాన్‌స్టబిలు మొహంచూశాడు సబినస్పెక్టరు రంగారావు.

"అవును సార్; తమరికన్న నాకు యింకా యెక్కువ బెంగగా వుంది. ఆ రోజు నేను నైట్‌డ్యూటీ వేసుకున్నాను కూడాను. నా నోటు బుక్కు తణిఖీలో ఆ సంగతి తేలిపోతుంది. నైట్‌డ్యూటీలో నేను ఉన్నా యింత ఘోరం జరిగిదంటే నన్ను సంజాయిషీ అడిగి డిస్మిసు చేస్తారని భయమేస్తోంది కూడాను—"

"అందుకు సందేహ మేమిటి? ఈ దొర చాలా స్ట్రిక్టుగా ఉంటు న్నాడు కూడాను—"

"చిత్తం. నేనూ అలాగే వింటున్నాను. నలుగురు పిల్లలూ నేనూ పాతికేళ్ల సర్వీసు అయింది; బోలెడు ఖూనీకేసులు చూశాను. కాని యిలాంటి చిక్కులో యిదివరకు పడలేదు."

"అందుకనే కాస్త జాగ్రత్తగా పనిచెయ్యాలి. నేను రేపు క్యాంపుకి వెడుతున్నాను. ఎల్లుండి తెల్లవారేటప్పటికి వచ్చేస్తాను. ఈలోపల యేమైనా కూపీ తీయించు."

సెల్యూటు చేసి హెడ్ కాన్‌స్టబిలు వెళ్ళిపోయాడు. రంగారావు కూచుని చాలా తీక్షణంగా ఆలోచిస్తున్నాడు.

ఇప్పటికి రెండేళ్లే అయింది, అతను సర్వీసులో చేరి. ఈ ఖూనీ కేసు ఇతని హయాంలో నాలుగోది. ప్రొబేషనులో ఉన్నప్పుడు చాలా కేసులు వచ్చినా, సీనియరు ఇన్స్పెక్టరు యెవడో వెళ్ళి విచారించేవాడు. స్టేషన్ చార్జి ఇండిపెండెంటుగా తీసుకున్న తరువాత వచ్చిన కేసులలో యిది నాలుగోది. అంతకు పూర్వము వచ్చిన మూడు కేసులలోనూ రెండింటిలో ముద్దాయిలు అప్పుడప్పుడే పట్టుబడిపోయారు. గ్రామ మునసబు పంపించే రిపోర్టుతోబాటే, ముద్దాయిల్నీ సాక్షుల్నీకూడా పంపించేశాడు. ఆ సాక్షులు సబ్‌మేజిస్ట్రేటు దగ్గరా, సెషన్సు కోర్టు లోనూ చెప్పవలసిన ముక్కలు వాళ్లకి పాఠంచెప్పి, ఆ రెండు కేసు ల్లోనూ ముద్దాయిలకి శిక్షలు వేయించాడు. మూడో కేసులో, ఎవడినో అరెస్టుచేసి సాక్ష్యం కూర్చాడుగాని, ఆ సాక్షులలో ఎవరూ అబద్ధం చెప్పలేదు. సెషన్సు జడ్జీ సాక్ష్యం బలంగా లేదని కేసు కొట్టివేశాడు.

ఇదుగో—యీ కేసు నాలుగోది. నాలుగు రోజులనాడు, జిల్లా సూపరింటెండెంటు స్టేషను తణిఖీచేస్తూ ఆ వూళ్ళో మకాం ఉండగానే, ఆ వూళ్ళో పేరుమోసిన రైతు సోమిరెడ్డిని ఎవరో కత్తితో పొడిచి చంపారు. శవం వూరిబయట కాలవవొడ్డున పడివుంది. మెడలో, ఒక ప్రక్కనుంచి ఇంకొక ప్రక్కకి పెద్దకన్నం పడివుంది. జిల్లా సూప రింటెండెంటు కూడా చూశాడు ఆ శవాన్ని. ఇన్వెస్టిగేషన్ సరిగ్గా చెయ్యక పోతే నీ దుంప తెంపేస్తానని ధ్వనించింది సబిన్‌స్పెక్టరుకి.

రెండేళ్ళ సర్వీసుతో సబినస్పెక్టరు ఎంత భయపడుతున్నాడో, పాతికేళ్ల సర్వీసుగల హెడ్ కాన్‌స్టబిలు కూడా అంత భయపడుతున్నాడు. బాధ్యతలేని కాన్‌స్టబిల్సు అంతా తికమకపడుతున్నారు. ఏ కేసయినా అంత భయపడరు కాని. ఖూనీ కేసంటే మాత్రం ఎంత ఆరితేరిన సబినస్పెక్టరయినా బెదురుతాడు. అందులో యేపత్తాలేని ఇలాటి కేసులు కొంచెం చిక్కులు తెచ్చే బాపతు కూడాను.

సబినస్పెక్టరుకి హెడ్ కాన్‌స్టబిలూ, అతనికి తక్కిన కాన్‌స్టబిల్సూ, వీళ్లకి గ్రామమునసబూ సహాయం చేశారు. సోమిరెడ్డి బంధువులంతా, రెడ్డిని చంపిన వాడిమీద పగ తీర్చుకోడానికి చాల ప్రయత్నం చేశారు.

చివరికి హంతకుడు దొరికాడు. సోమిరెడ్డికీ అతనికీ పదేళ్ళగా విరోధము ఉంది. ఆ విరోధము ఇటీవల నాలుగైదేళ్ళనుంచి దినాదినాభివృద్ధి చెందింది. వీళ్ళిద్దరి పొలాలూ ప్రక్క ప్రక్కలలో ఉన్నాయి. నీటిపారుబడిలో తగాదా వచ్చింది. నెలనాడు బహిరంగంగానే పోట్లాడుకున్నారు. హత్య జరిగిన రోజు సాయంత్రం సోమిరెడ్డి తన పొలానికి వెళ్ళాడు. మళ్ళీ రాత్రి యింటికి రాలేదు. ఇంట్లోవాళ్లు గాభరా పడ్డారు. మర్నాడు ఉదయమే ఇతని శవం కనపడింది. హత్య జరిగినరోజు సాయంత్రమే, సోమిరెడ్డి విరోధి లింగయ్యకూడా తనపొలం వెళ్లాడు. అతను ఆ రోజు రాత్రి ఎనిమిది గంటలవేళ యింటికి తిరిగి వచ్చాడు. ఇంటికి తిరిగే వచ్చేటప్పుడు ఒక సాక్షీ చూశాడు; రాత్రి ఏడు గంటల ప్రాప్రాప్పుకి, యితడు కాలవవొడ్డున యేదో ఆలోచిస్తూ పచారు చేస్తూ ఉండే ఒక సాక్షి చూశాడు. ఇదీ కేసు వివరం—

లింగయ్య మాత్రం పై సంగతులన్నీ వొప్పుకోడు. తాను ఆ రోజు పొలం వెళ్ళినమాట నిజమే అనీ, ఇంటికి ఎనిమిది గంటలకి వచ్చిన మాటా నిజమే అనీ, అంతవరకూ తాను తన పొలంలోనే ఉన్నాననీ చెపుతాడు. సోమిరెడ్డి ఆ రోజు సాయంత్రం తాను చూడనే లేదంటాడు.

ఛార్జిషీటు పెట్టిన మూడునెలలకి కేసు విచారణంతా పూర్తి అయింది. క్రింద సబ్ మేజిస్ట్రేటూ, పైన సెషన్సు జడ్జీ విచారించారు.

జ్యూరీవారంతా కేసు సావధానంగా విన్నారు. ముద్దాయి నేరము చేసినట్లు తాము నమ్మినామని తాపీగా చెప్పారు. లింగయ్య మాత్రం వాళ్ల మొహంకేసి చూశాడు. వాళ్ళు జడ్జీ మొహం చూశారు. జడ్జీ తనబల్ల మీదవున్న కాగితాల కేసి చూశాడు.

జడ్జీ లింగయ్యకి ఉరిశిక్ష వేశాడు. సబినస్పెక్టరు మొహం తళుక్కుమంది. దీనితో మూడు కేసులలో అతను నేరస్థుణ్ణి పట్టు కున్నాడు. హెడ్ కాన్‌స్టబిలు ఒక్కసారి ఆవులించి, నెత్తిమీద టోపీ సవిరించుకున్నాడు.

జడ్జి ఇంకో కేసు విచారణకు తీసుకున్నాడు. ఈ కేసుకి సంబంధించిన వాళ్ళంతా కోర్టు ఆవరణలోనుంచి వెళ్ళిపోయారు.

* * *

ఆరునెలలు గడిచాయి. సబినస్పెక్టరు రంగారావు స్టేషనులో కూచుని ఆలోచిస్తున్నాడు. ఆ రోజున అతనికి పనియేమీ అట్టే లేదు. ఎదురుగుండా నిలుచున్న కాన్‌స్టబిలు వూళ్లో భోగట్టా అంతా చెపుతూ ఉంటే, వింటూ మధ్య మధ్య ఏవో ప్రశ్నలువేస్తూ, కాన్‌స్టబిలు చెప్పిన జవాబుమీద దీర్ఘాలోచనలు చేస్తున్నాడు. ప్రక్కనే చిరుచాపమీద డస్కు ముందు కూచున్న స్టేషను రైటరు కాన్‌స్టబిలు చెప్పే వృత్తాంతాల్నీ, సబినస్పెక్టరు చేసే వ్యాఖ్యానాల్నీ శ్రద్ధగా గోళ్లు గోకుకుంటూ వింటున్నాడు.

"ఉహూఁ. అయితే, సుబ్బయ్య నాన్‌కోఆపరేషనులో చేరి శిక్ష పడ్డాడేం——" అని అడిగాడు సబినస్పెక్టరు.

"చిత్తం. శిక్ష పడ్డాడు. జైలునుంచి వచ్చాక మాత్రం ఆ మాటే లేదు. జైలులో తిండీ అదీ అలవాటుకాక పెద్ద జబ్బుపడ్డాడు కూడాను-" అని కాన్‌స్టబిలు జవాబు చెప్పాడు.

"అయితే యీ సుందరమ్మది ఏ వూరూ?" అన్నాడు సబినస్పెక్టరు. ఎవడో క్రొత్తమనిషి స్టేషనులోకి వచ్చి సబినస్పెక్టరుకి దణ్ణం పెట్టాడు.

"ఏం, ఎవరు నువ్వు?" అని కొంచెం అధికార పూరితమైన గొంతుతో అడిగాడు సబ్ఇన్‌స్పెక్టరు.

"చిత్తం. నేను కమ్మోరి అబ్బాయి నండి. నా పేరు రాజయ్యా" అని క్రొత్తమనిషి కొంచెం గాభరాతో గబగబా చెప్పాడు.

"అది సరేలేవోయి, నీకు ఏం కావాలి ఇప్పుడు?" అని కొంచెం విసువు చూపించాడు ఇనస్పెక్టరు.

"నేను మందుకోసం ఆస్పటాలుకి యెళ్లేనండి. డాక్టరుగారు తమర్ని వొక్కసారి పిల్చుకరమ్మంటే వొచ్చేనండి" అని ముగించాడు రాజయ్యా.

"సరే, వొస్తున్నానని చెప్పు" అని కుర్చీవీపుకి జేరగిలపడ్డాడు ఇనస్పెక్టరు.

"అర్జంటుగా రమ్మన్నారండి. ఎవడో వొకడికి ప్రాణంమీదికి వొచ్చిందంట. తమకి యేందో చెప్పాలంట—" అని, రాజయ్యా తన సందేశం పూర్తిచేశాడు.

"మళ్ళీ ఏం కొంపమునిగింది బాబూ-" అంటూ టోపీ నెత్తిన పెట్టుకొని. "నువ్వుకూడా హాస్పిటలు దగ్గరికిరా" అని తనతోటి యింత సేపూ మాట్లాడుతూవున్న కాన్‌స్టబిలుకి చెప్పి. తనుమాత్రం సైకిలు మీద హాస్పిటలుకి వెళ్లాడు ఇనస్పెక్టర్.

డాక్టరు, సబినస్పెక్టరుకోసం ఎదురుచూస్తూ కూచున్నాడు. సబిన స్పెక్టరు రాగానే గుడ్‌మార్నింగ్ చెప్పాడు. డాక్టరుకి ఎదురుగా ఉన్న కుర్చీలో కూచుంటూ, "ఏమిటో చెప్పండి, అసలు సంగతి. మళ్ళీ మర్డర్‌కేసు కాదుకద—" అని అడిగాడు రంగారావు.

"మర్డరుకేసు కాదు కాని—చాలా చిత్రమైన విషయం—నాగయ్య అని ఒకడు వున్నాడు యీ వూళ్ళో—" అని, తను చెప్ప వలసినవిషయాన్ని చమత్కారంగా చెప్పటానికి ప్రయత్నించాడు డాక్టరు.

"ఏ నాగయ్యా" ఆరంభంలోనే ఇన్వెస్టిగేషను మొదలుపెట్టాడు సబినస్పెక్టరు.

"ఇంటిపేరూ అదంతా నాకు తెలియదు. నేను చెప్పేది రెండే ముక్కలు సార్! తరువాత అతనినే చూపిస్తాను మీకు. అతన్ని ఎద్దు పొడిచింది. డొక్కలో ఆ పోటు చాలా బలంగా దిగింది. ఆస్పత్రికి వచ్చాడు. నువ్వు బ్రతకవని అతనితో చెప్పాను. అప్పటినుంచీ,

మీతోటి ఏదో రహస్యం చెప్పాలనీ, మిమ్మల్ని పిలిపించమని గొడవ చేస్తున్నాడు—"

డాక్టరు చెప్పవలసింది ఇంకా పూర్తికాలేదు. కాని "ఏడీ, వా డెక్కడ వున్నాడు?" అంటూ సబిన్స్పెక్టరు ఆత్రపడ్డాడు.

"అతను ఇంక ఓ అరగంటకంటె ఎక్కువ బ్రతక డనుకుంటాను" అంటూ డాక్టరు సబిన్స్పెక్టర్ని ఆపరేషన్ రూములోకి తీసి కెళ్లాడు.

సగం తెరిచిన కళ్లతో గది నాలుగుగోడల్నీ చూస్తూ నాగయ్య ఆ గదిలో ఒక టేబిలుమీద పడుకొని వున్నాడు. పొట్ట దగ్గర ఒక పెద్ద కట్టుకట్టి ఉంది.

"ఇదుగోనయ్యా, సబిన్స్పెక్టరుగారు వచ్చారూ, చెప్పు, ఏం చెప్పాలో" అని డాక్టరు, నాగయ్యతో చెప్పాడు.

నాగయ్య కళ్లు కొంచెం బాగా తెరిచి సబిన్స్పెక్టరు కేసిచూసి, రెండు చేతులూ దణ్ణం పెట్టడంకోసం ఎత్తబోయాడు, కాని ఎత్త లేకపోయాడు.

"అవన్నీ అక్కర్లేదులే, చెప్పు, ఏం చెప్పా లనుకుంటున్నావో" అన్నాడు సబిన్స్పెక్టరు. నాగయ్య డాక్టరు కేసి చూశాడు. "నేను ఉండ కూడదా యేమిటి?" అన్నాడు డాక్టరు.

"ఆ రొక్కరూ ఉంటే సాలు" అన్నాడు నాగయ్య సబిన్స్పెక్టరును చూపిస్తూ.

"నేను ఉన్నా ఫరవాలేదు. నేను మాత్రం ఎవరికి చెపుతాను ఈ సంగతులు?" అంటూ, సబిన్స్పెక్టరు ఏమనుకుంటాడో అని డాక్టరు అవతలికి వెళ్ళిపోయాడు.

నాగయ్య సబిన్స్పెక్టరుకేసి చూశాడు. ఆరిపోబోతూవున్న దీపం లాగ, ఆ కళ్లు ధగధగ మెరుస్తున్నాయి. సబిన్స్పెక్టరు ఆ చూపుకి తట్టుకో లేకపోయాడు. అతని నిలువంతా కంపించింది. "ఏం చెపుతావ్?" అని అడిగాడు; అతని గొంతుకలో ధ్వనించిన భయం నాగయ్య గ్రహించి ఉండడు.

"ఏం చెపుతానా? నా పాపం-ఆ పాపం చెయ్యబట్టే నాకు యీ గతి బట్టింది. నిండు ప్రాణం తీసేసినా; అప్పటినుంచీ భయంతో చస్తానే ఉన్నా, ఈనాటికి ఆఖరుకామోసు—" వొక్కసారి నాగయ్య కళ్లు మూసుకున్నాడు. సబినస్పెక్టరు అయోమయంగా అతని కేసి చూశాడు నాగయ్య కళ్ళు తెరిచాడు.

"నిండు ప్రాణాన్ని తీసేసినా; మీ రెవరూ పట్టలేకపోయినారు. కాని బగమంతుడే నాకు శిక్ష చెప్పిండు-అయితే-నా పాపం కోసం లింగయ్యని మీరు ఉరికి పంపినారు-" అన్నాడు.

సబినస్పెక్టరు గుండెలు ఆగిపోయేటంత తీవ్రంగాకొట్టుకున్నాయి. లింగయ్యపేరు సబినస్పెక్టరు ఇంకా మరిచిపోలేదు. లింగయ్యకు ఉరిశిక్ష పడటం—తనకి జిల్లా సూపరింటెండెంటు దగ్గర్నుంచి గుడ్ సర్వీసు యెంట్రీ రావడం తల్చుకున్నాడు. ఆ లింగయ్య—సోమిరెడ్డిని ఖూనీ చేసినందుకు సెషన్సు జడ్జీ ఉరిశిక్ష వేసిన లింగయ్య-నిరపరాధి. సోమిరెడ్డిని ఖూనీచేసిన నాగయ్య ఆరునెలలు తప్పించుకుని, ఇప్పుడు ఆ సంగతి బహిరంగంగా చెపుతూ ఉంటే తనకి తెలిసింది. నాగయ్య సోమిరెడ్డిని చంపాడు. తాను, లింగయ్యను చంపించాడు. ఎవరో చెప్పిన తప్పుడు మాటలు విని, లింగయ్యమీద చార్జిషీటుపెట్టి, ఆ తప్పుడు మాటలే రెండు కోర్టులలోనూ పలికించినవాడు తనే. అదంతా సబినస్పెక్టరు బుర్రలో తిరిగింది.

"సోమిరెడ్డికి ఆరువొందలు నేను బాకీ వున్నా. ఆ రోజు కాలవ గట్టున మేమిద్దరం కలిశాము. బాకీ సంగతి నన్నడిగాడు దానిమీద పెద్ద పోట్లాట వచ్చింది. నా చేతిలోవున్న చొప్పనరికే కత్తితో, సోమిరెడ్డిని పొడిచాను. అడుగో సోమిరెడ్డి—నా కళ్ళకి యింకా బాకీ అడుగుతానే కనబడతా వున్నాడు," అని కళ్ళు మూసుకున్నాడు నాగయ్య.

సబినస్పెక్టరు కళ్లకి జడ్జీగారి తీర్పు విన్నపుడు చూసినట్టుచూస్తూ లింగయ్య కనపడ్డాడు. సబినస్పెక్టరు ఒక్కడూ నిలబడలేక పోయాడు. బయటికి పోలేకపోయాడు. "డాక్టర్!" అని కేక వేశాడు. డాక్టరు గబగబా లోపలికివచ్చి, నాగయ్య చెయ్యి పట్టుకొని చూసి, "ఎస్, అయిపోయింది"

అని బయటికి నడిచాడు. డాక్టరు వెనకాలే సబిన్‌స్పెక్టరుకూడా బయటికి వెళ్లాడు.

ఆరు నెలలు సెలవు పెట్టి, ఆ సబిన్‌స్పెక్టరు ఇంటికి వెళ్లాడు.

---

# 18. మాణిక్యం

పల్లెటూరి కాపురంలో పాటుపడి రోజులు వెళ్ళదీసే కాపు కుటుంబాలలో సుబ్బన్న కుటుంబంకూడా చెప్పతగ్గదే. కుటుంబమంటే, పాతిక యిరవై మంది లేరు. సుబ్బన్నా, పెళ్లాం మాణిక్యమూ, ఆరేళ్ల కొడుకూను. ఓర్పుకీ, పెద్దమనిషితనానికీ, సాటి కుటుంబాలలో మాణిక్యాన్ని ఉదాహరణంగా తీసుకునేవారు. చుక్క పొడవడంతోటే నిద్ర లేచి, కొంచెం పుల్లనీళ్లూ అన్నమూపెట్టి మొగుణ్ణి పొలానికి పంపించి, యెద్దుల గాటి దగ్గర పేడా, దంటూ యెత్తి శుభ్రంచేసుకొని యిల్లూ దొడ్డీ వూడ్చి, కలాపి చల్లుకొని, చల్ల చిలికి నోట్లో బొగ్గు వేసికొని దంతధావన ఆరంభించేసరికి సాగదీసుకుంటూ కొడుకు నిద్ర లేచేవాడు; తనతోపాటు వాడికికూడా మొహం కడిగి, కవ్వం దగ్గిర చల్లతోటీ, వెల్లుల్లికారంతోటీ వాడికి చద్దిపెట్టి తను తినేప్పటికి బారెడున్నర పొద్దెక్కేది. గబగబా రెండు గేదెలకీ, చిట్టూ తవుడూ పెట్టి, కడుపునిండా నీళ్ళు పట్టి, నాలుగు దుత్తల పాలూ తీసి, పిడకల దాలిమీద పడేసి, వంట ఆరంభించేది. పొద్దు నడినెత్తిమీదికి వచ్చేటప్పటికి బువ్వమూటా నీటి దుత్తా పట్టుకొని, అప్పుడే యెద్దుల మెడమీద కాడి దించి తనకోసం యెదురుచూస్తూ వేపచెట్టు నీడన కూర్చునే సుబ్బన్నని చేరుకొనేది. సుబ్బన్న దుత్తా, మూటా అందుకొని ఆరగించేసరికి, తారాజువ్వలాగ కొడవలితో మోపెడు చొప్పకోసి కట్ట కట్టుకొనేది. లెక్కకి నాలుగు నిమిషాలు, ఊళ్ళోసంగతులు విమర్శనలతో సహా మాట్లాడుకొనేవారు